పువ్వుల్లో దాగున్న పళ్లూ, సీతాకోక ఒళ్లూ నిజంగా అతిశయాలే. అంతకు ఎంత మాత్రమూ తీసిపోని అతిశయాలు ఈ జీవులు. ఎందుకంటే ఒంటి మీద లేలేత చిగుళ్లు మొలిచినట్టు, చిట్టి రెమ్మలు, తీగలూ పారినట్టు కనిపిస్తాయి ఈ ప్రాణులు. వీటిలో సంద్రంలో ఉండే సిత్రం ఒకటైతే చెట్టు కొమ్మల్లో రెమ్మల్లా కలిసిపోయేవి మరో రకం. ఎంత వింత ఇంత జీవులో... అని పాడుకునేలా ఎన్నో విశేషాలు ఉన్నాయి వీటిలో! తెలుసుకుందాం పదండి..



# చిగురు కొమ్మలు కావివి

# చిత్రాల జీవులు!



## తీగలో తీగనై..

తాము నివసించే పరిసరాల్లో కలిసిపోయి తమని తాము కాపాడుకుంటూ, ఆహారాన్ని సంపాదించుకునేలా చిత్రమైన రూపాల్లో ఉంటాయి కొన్ని జీవులు. వాటిలో ఒకటే 'లైకేన్ కేటిడిడ్'. మిడతల జాతికి చెందిన ఇవి లేత ముదురు ఆకుపచ్చ రంగుల్లో సన్నటి దారాల్లా ఉండే తీగల గుంపుగా కనిపించే లైకేన్ అనే ఒక రకం మొక్కల్లాంటి వాటి మీద జీవిస్తాయి. లైకేన్ శిలీంధ్రం, శైవలాల కలయిక వల్ల ఏర్పడ్డ మొక్కను పోలిన నిర్మాణం. అయితే దీని ఆధారంగానే బతికే కేటిడిడ్‌లు అందులో కలిసిపోయేలా అచ్చం అవే రంగుల్లో ఉంటాయి. అంతేకాదు ఈ తీగలను పోలి ఉండేలా దీని కాళ్లు శరీరం నుంచి సన్నటి తీగల్లాంటి నిర్మాణాలూ పొడుచుకు వచ్చినట్టు ఉంటాయి. దీంతో లైకేన్ మీద ఇది నిలుచున్నా, నడిచినా అసలక్కడ ఒక కీటకం ఉంది అన్న విషయాన్ని గుర్తించడమే కష్టం. కావాలంటే ఫొటో చూడండి, అందులో మిడతను కనిపెట్టడానికి ఎవరికైనా సమయం పడుతుంది.

## గొల్లభామ చిగురించింది

పచ్చటి, ఎండుటాకుల్లా ఉండే గొల్లభామలను మన దగ్గర చూస్తుంటాం కదా! అదిగో అదే జాతికి చెందింది ఈ చిత్రంలో కనిపిస్తున్న పురుగు. దీన్ని డ్రాగన్ మాంటిస్ అని పిలుస్తారు. స్టెనోఫైలా లాబివర్టెక్స్ దీని శాస్త్రీయ నామం. అచ్చం చిన్న చెట్టు రెమ్మలా ఉండి, అక్కడక్కడా చిగుళ్లు, ఆకులు వచ్చినట్టు కనిపించే శరీరం దీని ప్రత్యేకత. ఒక జీవి తనను తాను కాపాడుకోవడానికి ఎన్ని రకాల పరిణామాలు చెందుతుంది అన్నదానికి దీన్ని చక్కని ఉదాహరణగా చెప్పొచ్చు అంటారు శాస్త్రవేత్తలు. ఇవి ఎక్కువగా పెరు, ఈక్వెడార్‌లాంటి దేశాలతోపాటు ఆగ్నేయ ఆసియా దేశాల్లోని వర్షారణ్యాల్లో, అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో కనిపిస్తాయి. మన గొల్లభామల్లాగే ఇవి కూడా హానికరమైనవి కావు. దీన్ని చూస్తుంటే గొల్లభామ కొత్త చిగుళ్లు వేసినట్టు ఉంది కదూ!





## మగవే కంటాయి..

ఈ జీవిని చూడండి... ఏదో కొమ్మలు, ఆకుల మధ్య దూరి చూస్తున్నట్టు కనిపిస్తుంది కదూ! కానీ ఆ ఆకులూ, చిగుళ్లలా కనిపిస్తున్నదీ దాని శరీరమే. దీని పేరు 'లీఫీ సీ డ్రాగన్'. బొమ్మల్లో మనకు కనిపించే డ్రాగన్ లాంటి ఆకారంలో ఉండే సముద్రజీవి అన్న మాట. సీ హార్స్‌గా మనం పిలిచే నీటి గుర్రాల జాతికి చెందినది. ఈ జీవుల రూపమే కాదు, పుట్టుకా విచిత్రమే. ఇందులో మగవే పిల్లల్ని కంటాయి. జట్టుకట్టే ముందు రెండూ కలిసి అందమైన నృత్యం చేస్తాయి. ముఖ్యంగా సాయంత్రాలు ఇలా ఒకదాన్ని మరొకటి అనుకరిస్తూ డ్యాన్స్ చేస్తాయి. రెండిటికీ సమన్వయం కుదిరితే ఆడ సీ డ్రాగన్ గులాబీ రంగులో ఉండే వందా రెండు వందల గుడ్లను మగ దానికి బదిలీ చేస్తుంది. వీటిలో మగ వాటికి తోక అడుగు భాగంలో 'బ్రూడ్ ప్యాచ్'గా పిలిచే ప్రత్యేక నిర్మాణం ఉంటుంది. ఆడ డ్రాగన్ బదిలీ చేసిన గుడ్లు దీనికి అతుక్కుంటాయి. దాని ద్వారానే వాటికి ఆక్సిజన్ అందుతుంది. ఈ బ్రూడ్ ప్యాచ్‌లాంటి నిర్మాణంలోనే అవి ఫలదీకరణం చెందుతాయి. నాలుగైదు వారాల తర్వాత మగవే గుడ్డు నుంచి పిల్లల్ని బయటికి వచ్చేలా చేస్తాయి. ఇక, వీటి శరీరం చుట్టూ ఉన్న ఆకుల్లాంటి నిర్మాణాలు వాటి రక్షణ కోసమన్నమాట. నీళ్లలోని మొక్కలు, నాచులో కలిసిపోయేలా ఈ చిగుళ్లలాంటి వాటి రంగులను మార్చుకోగలవు కూడా. పెద్దగా ఈత రాని ఇవి అలా శత్రువుల నుంచి తప్పించుకుంటూ జీవిస్తాయి. ఇంతకీ, ఇవి ఆస్ట్రేలియా పడమర, దక్షిణ ప్రాంతాల్లోని సముద్రాల్లో ఉంటాయి. అంతేకాదు, ఈ జీవి దక్షిణ ఆస్ట్రేలియా ప్రాంతానికి సాగర చిహ్నం (మెరైన్ ఎంబ్లమ్) కూడా!